క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి 13వ వార్డులో శనివారం సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ కింద రూ. ఐదు లక్షల నిధుల మంజూరుకు కృషి చేసిన హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందమల్ల బాబు, వేముల పుష్పలత, సందమల్ల నరేష్, దుబాసి తిరుపతి, సమ్మయ్య, శ్రీకాంత్, ముక్క రమేష్, జూపాక నరసింహంలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కుమారస్వామి

హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామానికి చెందిన అంబాల కుమారస్వామి, బుజ్జ సరిత శనివారం ప్రారంభించారు. చలి వేంద్రం ఎండ కాలంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బాల వికాస ఏరియా సెంటర్ మేనేజర్ ఖాజాబీ, రజిత, కల్యాణి తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మానకొండూర్: ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ 14వ తేదీన బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రారంభించనున్న లక్ష కిలోమీటర్ల రథ యాత్ర, పదివేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈమేరకు మండల కేంద్రంలో దళిత నాయకులు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అంజయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్ సంఘీభావం తెలుపుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని నియోజకవర్గ బాధ్యులు రాజేంద్ర ప్రసాద్ శనివారం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి, నియోజక వర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అగ్రవర్ణ పేదలందరూ ఆదిలాబాద్ కేంద్రంగా ప్రారంభం కానున్న రథయాత్రను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామం నుంచి ఐదు కార్లతో బయలుదేరి యాత్ర ప్రారంభంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కోశాధికారి ఆరెల్లి బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ఇందిరమ్మకాలనీ కూడలిలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిప్యూటీ తహసీల్దార్ పార్థసారధికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రవి, సంపత్, సాగర్, మల్లేశ్, తిరుపతి, ఐలయ్య,ఓదెలు, శ్రీనివాస్, శంకర్, రాజు ఉన్నారు.

గర్భిణులకు సీమంతం



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ పరిధి కోనరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వంచ పద్మ, వైద్య సిబ్బంది శ్రీలత, సరోజన, సుజాత, తల్లులు పాల్గొన్నారు.

14 బైక్‌లు సీజ్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో శనివారం నంబర్‌ప్లేట్ లేని 14 బైక్‌లను సీజ్ చేశామని ఎస్సై రవి తెలిపారు. వివిధ గ్రామాల నుంచి నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, మైనర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.



నిర్మాణంలో నూతన పంచాయతీ భవనం



బీటీ రోడ్డుగా మారనున్న రాయికల్ తండా-ఘనపూర్ మట్టిరోడ్డు

రాయికల్ తండాకు మహర్దశ

- 2016లో మూడు తండాలను కలిపి జీపీగా ఏర్పాటు
- కరీంనగర్ జిల్లాలో ఏకైక గిరిజన గ్రామ పంచాయతీ
- మౌలిక వసతుల కల్పనకు నిధుల వరద



పాఠశాలలో కొనసాగుతున్న రాయికల్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయం

సైదాపూర్: కొండలు, అటవీ ప్రాంతంలో గుడారాలు, గుడిసెలు నిర్మించుకొని నివసించేవారిని గిరిజనులుగా, ఏ గ్రామం రెవెన్యూ శివారులోని అటవీ ప్రాంతంలో నివసిస్తే వారిని ఆ గ్రామ పరిధిలో తండాగా ప్రభుత్వం గుర్తించింది. గతంలో తండా వాసులకు రోడ్డు రవాణా, తాగునీరు, విద్యా, వైద్యం అరకొర వసతులతో కొనసాగేది. అలాంటి తండాలను రాష్ట్రం ఏర్పాడ్డాక బీఆర్‌ఎస్ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. కరీంనగర్ జిల్లాలో ఏకైక అటవీ ప్రాంతం ఉన్న సైదాపూర్ మండలంలోని రాయికల్, ఘనపూర్, పెరుకపల్లి గ్రామాల పరిధిలోని రాయికల్, ఘనపూర్, నల్లాని తండాలను కలిపి 2016లో ప్రభుత్వం రాయికల్ తండా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. జీపీలో 717 మంది ఎస్టీ జనాభా ఉంది. అందులో 517 మంది ఓటర్లు ఉన్నారు. తాత్కాలికంగా నాటి నుంచి నేటి వరకు రాయికల్ తండాలో ఉన్న పాఠశాల భవనంలో జీపీ కార్యాలయం కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ కావడంతో తండాలకు చెందిన గిరిజనులే పంచాయతీ పాలకులయ్యారు. తండాల నుంచి నూతన గ్రామ పంచాయతీలో పలువురికి ఉద్యోగం, ఉపాధి లభించింది.

మౌలిక వసతుల నిర్మాణం

మూడు తండాల్లో సుమారు రూ.80 లక్షలు వెచ్చించి సీసీ రోడ్లు నిర్మించుకున్నారు. గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షలు, ఎస్టీ కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షల నిధులు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. మూడు తండాలకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తి చేశారు. వేసవిలో పనులు పూర్తి చేయాలని తండా వాసుల విజ్ఞప్తి మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సుమారు 4 కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులు పూర్తయితే తండాలకు రవాణా సమస్య తీరనుంది. మూడు తండాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. నల్లాని తండాలో పాఠశాలకు పక్కా భవనాలున్నాయి. ఘనపూర్ తండా, రాయికల్ తండాల్లో పక్కా భవనాలకు నిధులు మంజూరు చేయాలని తండావాసులు మంత్రికి విన్నవించారు. తండాలు అటవీ ప్రాంతంలో ఉన్నప్పటికీ, హరితహారంలో మొక్కలు నాటి సంరక్షించారు. తండాలల్ల పచ్చని ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేశారు. వైకుంఠధామం, సెగ్రిగేషన్‌షెడ్లు, ఇంకుడుగుంతల నిర్మాణంతో రాయికల్ తండా ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది.

గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం



బీఆర్‌ఎస్ ప్రభుత్వం మా తండాలను జీపీగా ఏర్పాటు చేసినందుకు అదృష్టంగా భావిస్తున్నాం. గతంలో ఇతర గ్రామాలు, కులాల నాయకుల కింద పని చేశాం. తండాలకు ఏదైనా కావాలంటే వెంటపడి తిరిగినా పనిచేసేవారు కాదు. ఇప్పుడు మా తండాకు మేమే పాలకులం. సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి తండాల్లోని సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి చేసుకుంటున్నాం. గ్రామ పంచాయతీ ఏర్పాటుతో కొందరికి ఉద్యోగం, ఉపాధి, రాజకీయ అవకాశాలు దొరికాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ముందు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటాం.

– బాదావత్ భిక్షపతి, మాజీ సర్పంచ్ పెరుకపల్లి(నల్లానితండా)



మానకొండూర్: మానకొండూర్ గ్రామ శివారులోని డీబీఎం 3 ఉపకాలువ ద్వారా సాగు నీరు పంట పొలాలకు వెళ్తోంది. మానకొండూర్ నుంచి జమ్మికుంటకు వెళ్లే దారిలో కాలువ వద్ద ఎలాంటి రక్షణగోడ నిర్మించలేదు. దీంతో వాహనదారులు అదుపు తప్పి నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సానగొండ రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్ నంబర్: 94408 18867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

బీఆర్‌ఎస్ వీణవంక మండల కమిటీ లేనట్టేనా..?

- నాలుగేళ్లుగా అధ్యక్ష పదవి ఖాళీ..
- కార్యకర్తల్లో సమాచార లోపం

వీణవంక: బీఆర్‌ఎస్ వీణవంక మండల అధ్యక్ష పదవితో పాటు కమిటీని నాలుగేళ్లుగా నియమించడం లేదు. క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ పూర్తి స్థాయి కమిటీ లేకపోవడంతో కార్యకర్తలు సందిగ్ధంలో ఉన్నట్టు ఆరోపణలు. కమిటీని నియమిస్తే పార్టీ బలోపేతంతో పాటు క్షేత్రస్థాయిలోకి పార్టీ కార్యక్రమాలు వెళతాయని కార్యకర్తలు భావిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం జరిగిన ఉపఎన్నికల సమయంలో ఈటల రాజేందర్ బీజేపీలోకి చేరడంతో పార్టీ మండల అధ్యక్షుడు కొంరయ్య సైతం ఈటలతో బీజేపీలో చేరాడు. దీంతో అప్పటి నుంచి మండల కమిటీని వేయలేదు.

నాలుగేళ్లుగా కమిటీపై నీలినీడలు.....

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సొంత మండలం కావడంతో ఇక్కడ బీఆర్‌ఎస్‌కు పట్టుంది. అంతేకాకుండా ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆఎస్ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే మండల కమిటీ లేకపోవడంతో కార్యకర్తలు పెద్దగా పట్టింపులేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని నియమించడంతో పాటు అన్ని గ్రామ కమిటీలు వేశారు. కానీ బీఆర్‌ఎస్‌లో మండల, గ్రామ కమిటీలు వేయకపోవడంతో కార్యకర్తలు డైలమాలో పడ్డారు. ఇప్పట్లో నియామకం చేపడితేనే రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయొచ్చని కార్యకర్తలు భావిస్తున్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

- బాబూ జగ్జీవన్‌రామ్
- జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, దళిత, వివిధ సంఘాల నాయకులు ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఉపప్రధానిగా, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కుల రహిత సమాజం కోసం జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. శంకరపట్నం మండలం కేశవపట్నంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎస్సై రవి, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అక్కడక్కడ బైక్ ర్యాలీ తీశారు.





గంగాధర: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్



జమ్మికుంట: మున్సిపల్ అధికారులు, సిబ్బంది నివాళి



చిగురుమామిడి: ఇందుర్తిలో నివాళి అర్పిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి



హుజూరాబాద్‌లో బీజేపీ నాయకుల నివాళి





మానకొండూర్‌లో నాయకుల నివాళి, శంకరపట్నం: నివాళి అర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్

ప్రజల హక్కులను హరించొద్దు



సైదాపూర్: గొడిశాలలో ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిగురుమామిడి: హక్కులను హరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్‌పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గునుకులపల్లి, ఇందుర్తి, ఓగులాపూర్ గ్రామాల్లో జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో మాట్లాడారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం దేశప్రజల హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తోందన్నారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జి గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, జిల్లా నాయకులు రవీందర్, మల్లేశం, బాలయ్య, నరేందర్, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు జై బాపు, జై భీం, జై సంవిధాన్‌లో భాగంగా భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటూ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నాయకులు శ్రావనకుమార్ ఉన్నారు.

సైదాపూర్: భారత రాజ్యాంగం ద్వారానే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సైదాపూర్ మండల అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్ అన్నారు. మండలంలోని రాయికల్ తండా, రాయికల్, బొమ్మకల్, అమ్మనగుర్తి, గుండ్లపల్లి, నల్లరామయ్యపల్లి, గొడిశాల, గుజ్జులపల్లి, ఎల్లంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ తీశారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశ ప్రజలకు సమాన హక్కులు, సమన్యాయం, కల్పించాల్సిన నాయకులు రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నార అన్నారు. సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మిట్టపల్లి కిష్టయ్య, మ్యాకల రవీందర్, లంకదాసరి మల్లయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్, బొమ్మగాని రాజు, నవీన్, విద్యాస్ రెడ్డి, రాజ్‌కుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలో చేపట్టిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ పాదయాత్ర నాలుగో రోజు కొనసాగింది. అన్నారం, లలితాపూర్, దేవంపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సంపత్‌గౌడ్ మాట్లాడుతూ.. మతతత్వ పార్టీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందోని రాజ్యాంగా పరిరక్షణకు అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఓదెలు, ఆంజనేయులు, మహేందర్, వరహాలచారి, కొమురయ్య, దేవేంద్ర పాల్గొన్నారు.

శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు క్యాస చక్రధర్ శనివారం తెలిపారు. కల్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి సేవలో తరలించాలని కోరారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

మానకొండూర్: మండలంలోని అన్నారం, మానకొండూర్, గంగిపల్లి, లలితాపూర్, ఖాదర్‌గూడెం, ఈదులగట్టెపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, కొండపల్కల, ఊటూరు, వెల్ది, గ్రామాల్లోని వివిధ ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు నీడ సౌకర్యం కోసం నిర్వాహకులు చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు, అన్నదానం నిర్వహించనున్నామని తెలిపారు.

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శ్రీభక్త మార్కండేయ దేవాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతాదేవి, హన్మంతుడి విగ్రహాలను శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ దంపతులు చెన్నమనేని సుచరితరాజేందర్‌రావు శనివారం ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులకు అందజేశారు. కల్యాణోత్సవ విగ్రహాలను బహూకరించగా ప్రత్యేక పూజలు నిర్వహించి దాత ఇంటి నుంచి ఊరేగింపుగా దేవాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, శ్రీహరిహర క్షేత్ర భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.



విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న శ్రీభక్తమార్కండేయ దేవాలయ కమిటీ సభ్యులు

సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, అడ్వకేట్ నూతాల శ్రీనివాస్ ఇటీవల హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, నాయకుల ఆధ్వర్యంలో శనివారం శాలువాలతో శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చు శివకుమార్, రాజేశ్‌ఠాగూర్, యాంసాని సమ్మయ్య, పొనగంటి రవికుమార్, నాగపూరి విజయ్, అప్పల రవీందర్, ఆకుల పోచయ్య, చందా మహేందర్, రమేశ్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉన్నప్పుడే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకుంటారని షీ టీమ్స్ సీఐ శ్రీలత అన్నారు. శనివారం కరీంనగర్ మండలం నగునూరులోని ఎస్పీఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్య, వినోదం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలికల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు కరాటే బెల్టులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం.విజయమోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఆర్.యాకయ్య, డైరెక్టర్లు పీఆర్ రాజేందర్, జి.ప్రశాంత్, కె.శ్యాంసుందర్, ఎండీ బి.ఉపేందర్, ప్రధానోపాధ్యాయులు కె.చుక్కారెడ్డి, అడ్వకేట్ హేమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీలత

నియామకం



మానకొండూర్: కిసాన్‌సెల్ మానకొండూర్ మండల అధ్యక్షుడిగా మద్దికుంటకు చెందిన బుర్ర శ్రీకాంత్‌గౌడ్ నియామకమయ్యారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పురం రాజేశం, ఉపాధ్యక్షుడు ధ్యావ శ్రీనివాస్‌రెడ్డి శనివారం నియామకపత్రం అందజేశారు.

అదృశ్యం కేసు

జమ్మికుంట: పట్టణంలోని పాత మార్కెట్ ఏరియాకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యం కాగా శనివారం కేసు నమోదు చేశామని సీఐ రవి తెలిపారు. ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ పదేళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం హుజూరాబాద్‌లో ఓ వ్యక్తిని కలుస్తానని చెప్పి వెళ్లాడు. ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తుండటంతో భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని సీఐ వివరించారు.



రోడ్డుపైకి సాగునీరు

శంకరపట్నం: మండలంలోని ముత్తారం శివారులో శనివారం సాగునీరు రోడ్డుపై ప్రవహించింది. ఎల్‌ఎండీ నుంచి మండలంలోని వివిధ గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు ఉపకాలువలున్నాయి. కాలువల్లోకి ఎక్కువ నీరు వదలండంతో రోడ్డుపై ప్రవహించిందని రైతులు తెలిపారు.